ప్రజాశక్తి
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025
5
అనంతపురం





అభినందన సభలో మాట్లాడుతున్న షమీమ్ షఫీవుల్లా

అందరి సహకారంతోనే....

బాలోత్సవం విజయవంతం

బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా ప్రజలందరి సహకారంతో అనంత బాలోత్సవం-5 విజయవంతం అయ్యిందని అనంత బాలోత్సవం కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా తెలిపారు. అనంత బాలోత్సవం-5 మూడు రోజుల పిల్లల పండుగ ఈ నెల 14, 15, 16వ తేదీల్లో అనంతపురం నగరంలో విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో నగరంలోని రామ్‌నగర్ క్రీసెంట్ స్కూల్లో ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, బాలోత్సవ న్యాయనిర్ణేతలు, వాలంటీర్లకు అభినందన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ మూడు రోజుల పాటు పిల్లల పండుగను దిగ్విజయంగా నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. పిల్లల కళాప్రదర్శన, ప్రతిభా పాటవాలను దగ్గరుండి చూడడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పిల్లల ఉత్సాహం ఆరాటం చూస్తుంటే బాలోత్సవాలను మరింత పటిష్టంగా నిర్వహించాలనే తపన కలుగుతోందన్నారు. న్యాయనిర్ణేతలు, వాలంటీర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, విద్యా శాఖ అధికారులు, కలెక్టర్, యంత్రాంగం నుంచి అందిన సహకారం మరువలేనిది అన్నారు. లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ ముందుకొచ్చి కార్యక్రమాల నిర్వహణకు చక్కటి వేదికను ఇచ్చి ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు. భోజన దాతలు కూడా పిల్లల కోసం ముందుకు వచ్చి మూడు రోజుల పాటు టిఫిన్, భోజనం, టీ, పండ్లు వంటివి అందించి సహాయం చేయడం గొప్ప విషయం అన్నారు. ఎంతో మంది దాతల సహాయ సహకారాలు అందడంతోనే కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. వచ్చే ఏడాది నిర్వహించే బాలోత్సవం మరింత పటిష్టంగా, ప్రణాళికతో నిర్వహించేందుకు సూచనలు సలహాలు అందించాలని కోరారు. అనంతరం న్యాయనిర్ణేతలు, వాలంటీర్లు, కమిటీ సభ్యులు, మీడియా పాత్రికేయులకు అనంత బాలోత్సవం జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవం కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కోశాధికారి జిలాన్, కమిటీ సభ్యులు ఎస్‌వివి.రమణయ్య, వి.కోటేశ్వరప్ప, గోవిందరాజులు, రమణారెడ్డి, సరళ, దేవేంద్రమ్మ, చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని, సురేష్, గిరి, న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు.



రీ సర్వేకు సంబంధించి క్షేత్ర స్థాయిలో వివరాలు తెలుసుకుంటున్న సిసోడియా

క్షేత్రస్థాయి పరిశీలనతో భూ సమస్యలు పరిష్కారం

రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

భూముల రీసర్వేకు సంబంధించి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి.సిసోడియ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో పిజిఆర్ ఎస్, రీ సర్వే, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టిఎస్.చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల వర్గీకరణతో కూడిన ప్రత్యేక మ్యాప్ తయారు చేయాలని తెలిపారు. భూములకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమగ్ర వివరాలతో కూడిన రికార్డులను తయారు చేయాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్ కుమార్‌తో పాటు జిల్లాలోని తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లైనింగ్‌పై విముఖత

◆ భూగర్భ జలాలు తగ్గుతాయని రైతుల ఆందోళన ◆ హంద్రీనీవా రెండవ దశ పనులకు ప్రభుత్వం సిద్ధం

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా రెండవ దశ లైనింగ్ పనులను రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాలపై చేపట్టాలని భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఆదేశాలను జారీ చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. పనులను ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. లైనింగ్ పనులు చేపడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు లైనింగ్ లేకపోవడంతో కాలువకు అటూఇటు పది కిలోమీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయి. దీంతో రైతులు అయా ప్రాంతాల్లో ఉద్యానవన పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు లైనింగ్ చేపడితే భూగర్భజలాలు తగ్గి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. విపక్షాలు కూడా లైనింగ్ వద్దని డిమాండ్ చేస్తున్నారు.

184 కిలోమీటర్లు లైనింగ్

హంద్రీనీవా. రెండవ దశ జీడిపల్లి జలాశయం నుంచి ప్రారంభం అవుతుంది. 216 కిలోమీటరు నుంచి 400 కిలోమీటరు వరకు లైనింగ్ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం చేసింది. రూ.936 కోట్లతో ఈ పనులు చేపట్టారు. ప్రధానంగా సాగునీటి వనరుల్లేని



సత్య సాయి జిల్లాలో ఉంటుంది. ఇక్కడి రైతులకు హంద్రీనీవా ప్రధాన వనరుగా ఉంది. దీని కింద కూడా ఆయకట్టు లేదు. దీంతో భూగర్భ జలాలపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. అందుకే రైతులు లైనింగ్‌ను వ్యతిరేకిస్తున్నారు.



లైనింగ్ వద్దు ...వైడనింగ్ చేయాలి

జిల్లాకు ఇప్పుడు వస్తున్న నీళ్లు సరిపోవు. ఈ పరిస్థితుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలని కోరుతుంటే ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. లైనింగ్ కాకుండా వైడనింగ్ చేపట్టాలని కోరుతున్నాం.

వి.రాంభూపాల్,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు.



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానం రద్దు చేస్తే మున్సిపల్ పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయా లని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు డిమాం డ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ పొరాలు లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ తీర్మానాల ను కార్మికులకు వివరించారు. మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికు లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి మున్సిపల్ కార్మికులు అందరూ సమ్మెబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, కార్యదర్శి మల్లేష్, కోశాధికారి రాము, కార్మికులు సిద్ధ, ఎర్రిస్వామి, అశోక్, వెంకటేశులు, ఆదిలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

24న వాణిజ్య గదుల వేలం పాట

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయంలోని 8 గదులకు ఈ నెల 24వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కొండన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారున. సుమారు 55 నెలల తర్వాత అధికారికంగా వేలం పాట నిర్వహించడానికి ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశం హాలులో సోమవారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు. రూ. 20 వేల ధరావత్తు, రూ. 5వేల నెల అద్దె ప్రకారం 2025 మార్చి 1 నుంచి 2028 ఫిబ్రవరి 28వ తేదీ వరకూ అద్దెకు ఇస్తామని వివరించారు.

డెంగీపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

దోమ కాటు వల్ల వచ్చే డెంగీ ప్రాణాంతకం కావచ్చునని, తేలిక పాటు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దాని నుంచి రక్షణ పొందవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలి పారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో గురువారం డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త లను తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ షబానా, ప్రమీల, ఆశా కార్యకర్త అరుణబాయి పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం.. పోలీసులకు ఫిర్యాదు



ధ్వంసం చేసిన శిలాఫలకం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని మల్లాపురం లేఅవుట్‌లో స్వకులశాలి సమాజానికి కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు భూకబ్జాదారులు ధ్వంసం చేశారు. దీంతో గురువారం ఆ సామాజిక వర్గం ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 2018 డిసెంబర్‌లో ప్రస్తుత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అప్పుడు మంత్రి హోదాలో స్వకులశాలి సమాజానికి 70 సెంట్ల స్థలం కేటాయించారని గుర్తు చేశారు. అయితే ఆ స్థలంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసి స్థలం కబ్జా చేసేందుకు యత్నించినట్లు ఆరోపించారు. ఈ స్థలం కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్బన్ సిఐ, తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వినతి ఇచ్చిన వారి లో నాయకులు వెంకటేశులు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, శివానంద పాల్గొన్నారు.

సకాలంలో పి-4 మోడల్ సర్వే చేపడతాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో సకాలంలో పి-4 మోడల్ సర్వేను చేపడతామని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం ఏపీపీఎస్సీ, గ్రూప్-2, ఇంటర్మీడియట్ పరీక్షలు, పి4 మోడల్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, పెర్కోప్షన్ ట్రాకింగ్ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఎ.మాలోల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి మొదటి దశలో పి4 మోడల్ సర్వే మొదలు అయ్యిందన్నారు. సకాలంలో ఈ సర్వే చేపట్టేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని తెలియజేశారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 23వ తేదీన ఆదివారం నిర్వహించే ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలకు జాయింట్ కలెక్టర్ ఇన్‌ఛార్జిగా ఉంటారన్నారు. పరీక్షల కోసం అవసరమైన స్టేషనరీని చెక్ లిస్ట్ ప్రకారం సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. పరీక్షలు నిర్వహించే 14 కేంద్రాలలో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ అన్ని వెన్యూ కేంద్రాలను తనిఖీ చేయాలని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఆదేశించారు. ఇక మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు డిఆర్ఒ ఇన్‌ఛార్జిగా ఉంటారన్నారు. పరీక్షల ప్రశ్నాపత్రం మూమెంట్‌ను పోలీసులు తనిఖీలు చేయాలన్నారు. పరీక్షల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, సిసిటివి కెమెరాలు అన్ని కేంద్రాలలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఒఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డిఇఒ ప్రసాద్ బాబు, డివిఇఒ వెంకటరమణ నాయక్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, డిపిఒ నాగరాజు నాయుడు, సిపిఒ అశోక్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, జడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ ఎస్‌ఎన్.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షల కేంద్రం తనిఖీ

బుక్కరాయసముద్రం : ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి బుక్కరాయసముద్రం మండలం శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి) కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఆర్ఐటి కళాశాలలో ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతపురం నుంచి ఎస్ఆర్ఐటి కళాశాలకు పరీక్ష జరిగే రోజు అభ్యర్థుల సౌకర్యార్థం అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష సమయంలో అభ్యర్థి బుక్లెట్ సంబంధిత అభ్యర్థికే వెళ్లేలా చూసుకోవాలన్నారు. కళాశాల వద్ద ఎక్కువ టీంలను ఏర్పాటు చేసుకుని ఫ్రిస్కింగ్ జాగ్రత్తగా చేయాలని, పరీక్షలను మండల తహశీల్దార్ మానిటర్ చేయాలన్నారు. కళాశాల నుంచి సీసీటీవీల ఫీడ్ కలెక్టరేట్ కూడా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్‌ఎన్.షరీఫ్, ఎస్ఒ శంకర్ రావు, ఎస్ఆర్ఐటి గ్రూప్ 2 పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ జి.బాలకృష్ణ, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ యు.శ్రీనివాస్, తహశీల్దార్ పుణ్యవతి, ఎస్ఐ శేషగిరి పాల్గొన్నారు.

డిఎన్.సింగ్ సేవలను ఉపయోగించుకుందాం

జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి -అనంతపురం



డిఎన్.సింగ్‌కు జ్ఞాపికను అందిస్తున్న వైస్ ఛాన్సలర్

ఐఐటి ముంబాయి సీనియర్ ఆచార్యులు ప్రొఫెసర్ డిఎన్.సింగ్ అనుభవాలు, సేవలను వినియోగించుకుని యూనివర్సిటీ మరింత అభివృద్ధి సాధించాలా అందరూ కృషి చేద్దామని జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు తెలిపారు. జెఎన్‌టియు కాన్ఫరెన్స్ హాలులో వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, యూనివర్సిటీ డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, వివిధ విభాగాధిపతులతో డిఎన్.సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం జరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, ప్రాజెక్టుల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విసి సుదర్శనరావు మాట్లాడుతూ డిఎన్.సింగ్ సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ డిఎన్.సింగ్ జియో టెక్నికల్ ఇంజినీరింగ్ విభాగం అభివద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి టు వీసీ ఎన్.దేవన్న, పిఆర్ భానుమూర్తి, జివి.సుబ్బారెడ్డి, బి.ఈశ్వర్ రెడ్డి, ఎ.సురేష్ బాబు, సి.శోభా బిందు, వైశాలి ఘోర్పడే, వివి.చిత్ర, జి.ప్రశాంతి, ఆర్.కిరణ్మయి, పద్మ సువర్ణ, బి.దుర్గా ప్రసాద్, ఎపి.శివ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, డా॥టి.నారాయణ రెడ్డితో పాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఐటిఐలు మరింత మెరుగవ్వాలి : ఎంపి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఐటిఐ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపి

ప్రభుత్వ ఐటిఐ సాంకేతిక విద్యా సంస్థలను ఆధునిక కాలానికి అనుగుణంగా మెరుగుపరిచి, పారిశ్రామిక సంస్థల అవసరాలు, యువతకు ఉపాధి చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం అనంతపురం నగరంలోని ప్రభుత్వ ఐటిఐ బాలురు, బాలికల సాంకేతిక విద్యాసంస్థలను ఎంపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐలో ఇండస్ట్రీ నిపుణులను తయారు చేయడంలో ఎంతో కషి చేస్తున్నాయని చెప్పారు. తన వంతుగా ఈ ప్రభుత్వ సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖుష్బు కొఠారి, ప్రభుత్వ బాలికల, బాలుర ఐటిఐ సంస్థల ప్రిన్సిపాల్ రామ్మూర్తి, ఉపాధ్యాయులు నందకుమార్, గాయత్రీ దేవి, మురళీధర్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు చిత్తశుద్ధితో పనిచేయాలి:ఎమ్మెల్యే



డీలర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రేషన్ డీలర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. పట్టణంలోని ప్రజావేదికలో గురువారం నియోజకవర్గంలోని రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా పని చేయరాదని హెచ్చరించారు. తూకాల్లో తేడా లేకుండా లబ్ధిదారులకు రేషన్, తదితర నిత్యావసర సరుకులు సక్రమంగా అందజేయాలన్నారు. తూకాల్లో తేడా వస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. స్టాక్‌లో తేడా ఉన్నా, తూకాల్లో తేడా ఉన్న డీలర్లు మాత్రం లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాల న్నారు. తూకాల్లో తేడా వస్తే అధికారులతో చర్చించి సక్రమంగా సరుకులు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించామని స్పష్టం చేశారు.

సాగునీటిపై పాదయాత్ర సిగ్గుచేటు

జిల్లాలోని ఓ నాయకుడు సాగునీటిపై పాదయాత్ర చేస్తామని వట్టి ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రణాళికాబద్ధంగా కాలువ తవ్వకాల పనులు చేపట్టి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో తహశీల్దార్ భాస్కర్, టిడిపి నాయకులు మల్లికార్జున, గోళ్ల వెంకటేశులు, వైపి.రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఛైర్మన్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును గురువారం నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డైరెక్టర్ కడియాల కొండన్న, సాధికార కమిటీ సభ్యులు, నాయిబ్రాహ్మణులు పట్టణంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారు ముందుగా ఎమ్మెల్యేని సత్కరించగా, అనంతరం రుద్రకోటి సదాశివంను ఎమ్మెల్యే సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాయలసీమ అధ్యక్షులు బెళుగుప్ప ధనుంజయ, మోహన్, ప్రకాష్, తిమ్మప్ప, చాపిరి వెంకటేష్, మల్లికార్జునస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని చదం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలచంద్ర గురువారం ఓ ప్రకట నలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పల్లెపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కురగానపల్లి సబ్ స్టేషన్ పరిధిలో..

నార్పల : మండల పరిధిలోని కురగానపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8:30 నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ నీలకంఠ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రీసర్వేపై అవగాహన సదస్సు

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రీసర్వేపై విఆర్ఒలు, సర్వేయర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వే ఎలా చేయాలి, గ్రామకఠం, ప్రభుత్వ భూమి, వంకలు, వాగులనునెలా గుర్తించాలనే విషయాలను వివరించారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ డిపోలో సమస్యలపై మేనేజర్‌తో చర్చలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ఆర్టీసీ డిపోలో అపరిష్కృతంగా ఉన్న దాదాపు 20 సమస్యల పరిష్కారానికి డిపో మేనేజర్ శ్రీనివాసరావు సానుకూలత వ్యక్తం చేయడం పట్ల ఎపిపిటిడి(ఆర్టీసీ) నేషనల్ మజ్దూర్ యూని టీ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. స్థానిక డిపో కార్యాలయంలో గురువారం డిపో మేనేజర్ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ నాయకులతో చర్చించారు. చర్చల్లో డిపో ప్రెసిడెంట్ జిలాన్, కార్యదర్శి తిప్పేస్వామి, గ్యారేజ్ కార్యదర్శి సతీష్‌కుమార్, గ్యారేజ్ ప్రెసిడెంట్ దూద్‌పీరా, సిసిఎస్ డెలికేట్ నాగరాజు, డిపో ట్రెజరర్ యోగేంద్రకుమార్, తిమ్మరాజు, చంద్రశేఖర్, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌కు సన్మానం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

వైసిపి మండల నూతన కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డిని గురువారం వాల్మీకి సోదరులు మండలంలోని పాలవెంకటాపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి కార్మిక విభాగం తాలూకా అధ్యక్షులు తలారి సంజీవ, యువ నాయకులు రాము, గోవిందు, కోడిపల్లి గోవిందు, మంజు, లింగమయ్య, మాదయ్య, రాజన్న, శ్రీకాంత్, ఓబులేసు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

పుట్లూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ అలివేలమ్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఫారంపాండ్‌లను తవ్వాలన్నారు. కూలీలకు కనీస వేతనం రోజుకి రూ.300 వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ నరేంద్ర, టిఎలు, ఎఫ్ఎలు, తదితరులు పాల్గొన్నారు.

బాల సంరక్షణ విద్యపై శిక్షణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బాల్య సంరక్షణ విద్యపై గురువారం అంగన్వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్ కోర్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఇఒ ఓబుళపతి, కృష్ణానాయక్ తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం వేపులపర్తి, బ్రహ్మసముద్రం సెక్టార్ల సూపర్వైజర్లు రామాంజనమ్మ, కాశింబి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సును పాఠశాల విద్యాశాఖ అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రథమ్ సంస్థ ద్వారా 6 రోజుల ఆఫ్‌లైన్ శిక్షణ గత మంగళవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ ఈ నెల 25వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 3-6 ఏళ్ల లోపు పిల్లలకు శారీరక అభివృద్ధి, సామాజిక భావోద్వేగ, నైతిక అభివృద్ధి, మేధాభివృద్ధి, భాష, అక్షరాభివృద్ధి, సౌందర్య సాంస్కృతిక అభివద్ధి అంశాలకు సంబంధించిన వాటిపై శిక్షణ ఇస్తారన్నారు. డిఆర్‌పి శిక్షకులు అర్చన, రామాంజనేయులు, జగదీశ్ అంగన్వాడీ కార్యకర్తలకు తర్ఫీదు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మండలంలోని రెండు సెక్టార్ల పరిధిలోని 51 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ఐక్య విద్యార్థి సంఘాలు



విలేకరులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎ, పిఎస్‌యు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు నందు, మండల కార్యదర్శి హరుణ్ రషీద్, ఎఐఎస్ఎ నియోజకవర్గ కన్వీనర్ భీమేష్, పిఎస్‌యు జిల్లా జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల వేధింపులు, ఒత్తిడికి తట్టుకోలేక మూడు నెలలకాలంలోనే దాదాపు ఐదుగురు విద్యార్థులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల చావులకు నైతిక బాధ్యత కళాశాల యాజమాన్యాలే వహించాలన్నారు. తక్షణమే కలెక్టర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వంశీ, సాయి, హరీష్, నరసింహ, శివ, చరణ్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సలహాలు ఇస్తున్న వైద్యులు లోకేష్‌కుమార్

యల్లనూరు : రానున్న వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా ప్రజలను నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక వైద్యులు లోకేష్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న వేసవి తీవ్రతరంగా ఉంటుందన్నారు. అందుకు తగ్గట్టుగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యులు శివసాయి, సిహెచ్ఒ మధుకుమార్, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలు పరిశీలన

నార్పల : మండల పరిధిలోని బొందల వాడ, బి.పప్పూరు చెత్త సంపద కేంద్రాలను డిఎల్‌డిఒ లలితాబాయి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ మండలంలోని అన్నిచెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అంతేగాకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, క్లాక్‌మిత్రాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు

గుత్తి : గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం హానర్ అవార్డ్స్ అనే ప్రతిభా పురస్కారాలను ఇచ్చారు. పరీక్షల్లో 75 నుంచి 100 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కళాశాల యాజమాన్యం అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గేట్స్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్‌బాషా, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రజిత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'గోకులాలను' వేగవంతంగా పూర్తి చేయాలి

శింగనమల : మండల వ్యాప్తంగా నిర్మించుకుంటున్న గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ భాస్కర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని చిన్న జలాలపురం, నరసాపురం, గురుగుంట్ల, నాగులగుడ్డం గ్రామాల్లో రైతులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్లను ఎంపిడిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గోకులం షెడ్లు రైతులకు ఎంతోగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ఎంపిపి స్కూల్, అంగన్వాడీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, ఇసి దామోదర్, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు నిత్యావసర సరుకులు పంపిణీ

అనంతపురం : మాఘమాసం సందర్భంగా నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో అనంతపురంలోని వివిధ ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు గురువారం నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు కవిన్ ఆదిత్య, సత్యాత్మానంద స్వామి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో గురువారం స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పట్టణ కార్యదర్శి రామదాసు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా.. పేదలు, కార్మికులు, కర్షకులకు వ్యతిరేకంగా ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏమాత్రం నిధుల కేటాయింపులు లేవన్నారు. ముఖ్యంగా విభజన చట్టంలోని హామీల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు ఇవ్వాల్సిన ప్యాకేజీ ఇవ్వాలని కోరినా బడ్జెట్లో ప్రస్తావన లేదన్నారు. రైతులకు పూర్తిగా అన్యాయమే జరిగిందన్నారు. వ్యవసాయ కూలీలకు వలసల బాధ తప్పే పరిస్థితి లేదన్నారు. ఉపాధి కూలీలకు గతంలో కంటే ఈ ఏడాది ఇంకా తక్కువగానే బడ్జెట్‌లో కేటాయించారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా ఉందన్నారు. విద్య, వైద్యం నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. నిరుద్యోగ యువత పెరిగిపోతోందని పరిశ్రమల ఊసే లేదన్నారు. రైల్వేజోన్ రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడ్పడాలని అనేక ఉద్యమాలు చేస్తూనే ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. జిల్లాలోని సెంట్రల్ యూనివర్సిటీ, కుదిరేముక్ ఉక్కు పరిశ్రమ, ఎయిమ్స్ తరహా ఆసుపత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చి ఆ ఊసే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, చంద్ర, షాషా, జయమ్మ, వెంకీ, రాము, వీరన్న, ఓబులేసు, శివయ్య, మక్బూల్, జాషువా, బాషా, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పట్టణ నాయకులు నారాయణ, బాషా, జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై విస్తృత అవగాహన కల్పించాలి

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సైబర్ మోసాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి అడ్డుకట్ట వేయాలని ఎస్పీ పి.జగదీష్ గురువారం ఒక ప్రకటనలో సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. 'సైబర్ సురక్ష' (మన భద్రత- మన బాధ్యత) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అవగాహనలకు ప్రజలు, విద్యార్థుల నుంచి భారీ స్పందన లభిస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా పోలీసులు ఆయా పోలీసుస్టేషన్ల పరిధిల్లోని గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, జాతరలు, తిరునాళ్లలో సైబర్‌మోసాల పట్ల అవగాహన చేసే పనిలో నిమగ్నమయ్యారన్నారు. ఒకవైపు డిజిటల్ వాహనాలు, ఇంకో వైపు టాంటాం వాహనాల ద్వారా సైబర్ నేరాలు నిరోధించడానికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తెస్తున్నారన్నారు. నిరక్షరాస్యులకు సైతం అర్థమయ్యేలా డిజిటల్ వాహనాల ద్వారా వీడియోలు చూయించడం, టాంటాం ఆటోల ద్వారా ఆడియోలను వినిపిస్తున్నారన్నారు. ఈనెల 13 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో డిజిటల్ వాహనాల ద్వారా సుమారు 50వేల మందిని కలిశారన్నారు. కి రీచ్ అయ్యారు. ముఖ్యంగా, డిజిటల్ అరెస్టు, ఫెడెక్స్ కొరియర్ ఫ్రాడ్స్ , ఇన్వెస్ట్మెంట్, క్రిప్టో, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్, డెబిట్, క్రెడిట్ కార్డు ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, పార్ట్ టైం జాబ్, టాస్క్, జాబ్ ఫ్రాడ్, ఏపీకే, లింక్ మెసేజీ ఫ్రాడ్, ఏఈపీఎస్ ఫ్రాడ్ , ఫేక్ లోన్ యాప్ ఫ్రాడ్స్ పై ప్రొజెక్టర్ ద్వారా వీడియోలు చూయించి వివరిస్తున్నారన్నారు.మీరు సైబర్ మోసగాళ్ల బారిన పడితే వెంటనే మౌనం వీడి సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, సైబర్ క్రైమ్ పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్ఐసిలో నియామకాలు చేపట్టాలి

ఎల్ఐసి సిబ్బంది సమ్మె జయప్రదం



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఎల్ఐసి సంస్థతోపాటు పాలసీదారుల కోసం తక్షణం నూతన నియామకాలు చేపట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అనంతపురం బ్రాంచ్-2 కార్యదర్శి తాడేపల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం అనంతపురం బ్రాంచ్-2 కార్యాలయం వెలుపల ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిమ్మాపురం నాగరాజు ఆధ్వర్యంలో గంటపాటు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా రంగం రూపురేఖలు మారిపోతున్న దశలో, నూతన తరం పాలసీదారుల ఆకాంక్షల మేరకు పని చేయాలంటే అర్హత కలిగిన నూతన ఉద్యోగులను నియమించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జవాబుదారీతనం లేని ఔట్‌సోర్సింగ్ స్థానంలో రెగ్యులర్ నియామకాలే పరిష్కారమన్నారు. యుపిఎస్‌సి తరహాలో ప్రతి ఏటా ఎల్ఐసి లో అవసరమైన మేరకు నియామకాలు చేపట్టాలన్నారు. దేశంలో ఉన్న 80 శాతం ఎల్ఐసి సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమ సంఘం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ)కు గుర్తింపు పొందిన సంఘంగా హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థలోని వివిధ తరగతుల సంఘాల డివిజన్ నాయకులు శ్రీధర్, శివరామశర్మ, భార్గవరెడ్డి, రామల్‌నాయక్, వెంకటేష్, ఏజెంట్స్ అసోసియేషన్ తరపున చెరుకుతోట జగదీష్, ఆదిశేషయ్య, నాయకులు తుమ్మల సూర్యనారాయణ, రొద్దం హరి, బాబా ఫక్రొద్దీన్ , రమేష్, రామగోవిందరెడ్డి, హన్నా క్రిష్టియానా, నరసమ్మ, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమావేశాన్ని బహిష్కరిస్తాం

కౌన్సిల్‌మీట్‌లో సభ్యులు



సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి-గుత్తి

అభివృద్ధి పనులు ఏమాత్రం జరగకపోగా వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించనిపక్షంలో కౌన్సిల్ సమావేశానికి గైహాజరవుతామని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి స్పష్టం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభ మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వరలక్ష్మి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వెంకటరమణ, ఎన్.ఫారూక్, వి.వరదరాజులు, ఖాజా ఖాన్, షేక్ నజీర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ఏ వార్డుల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదనే సమావేశాలకు అరకొరగా కౌన్సిలర్లు హాజరవుతున్నారని చెప్పారు. ఇకపై తాము కూడా హాజరుకామని కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఖాళీ స్థలాలకు పన్నులు విధిస్తున్న అధికారులు, పట్టా స్థలాలపై నిర్మించుకున్న గహాలకు ఎందుకు పన్నులు వసూలు చేయడం లేదని కౌన్సిలర్ వి.వరదరాజులు ప్రశ్నించారు. ఇంటి పన్నులు విధించాలని గృహ యజమానులు కోరుతున్నారన్నారు. తమ వార్డులోని తురకపల్లి రోడ్డు పక్కన సిసి రహదారి ధ్వంసం అయిందని పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని కౌన్సిలర్ రమణ అన్నారు. పలుమార్లు సమావేశాల దష్టికి తెచ్చిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, మేనేజర్ పి.రాంబాబు, డిఇ హేమచంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, ఆర్ఒ సంతోష్ కుమార్, ఆర్ఐ షేక్షావలి, రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నగదు జమచేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-గుత్తి

రైతులు విక్రయించిన కందులకు సొమ్మును త్వరితగతిన వారి ఖాతాల్లో జమ చేయాలని వ్యవసాయ జిల్లా అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న కందుల కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. కందులను విక్రయించడానికి వచ్చిన రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కందులు విక్రయించి 15 రోజులు అయినా తమ ఖాతాల్లో నగదు జమ కాలేదని డిఎఓ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. దీంతో ఆమె కందుల కొనుగోలు కేంద్రం సిబ్బంది, మార్క్ ఫెడ్ ఏజెన్సీ అధికారులతో చర్చించారు. రైతులు ఇబ్బందులు పడకుండా రైతుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం అగ్రి ల్యాబ్‌ను సందర్శించి రికార్డులు, ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు, వ్యవసాయ సాంకేతిక అధికారులు వెంకట్‌కుమార్, రాకేష్‌నాయక్, బాలానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కూలీల వలసల నివారణకు చర్యలు

కరువు మండలాల్లో అదనంగా 50 రోజుల పనిదినాలు-పీడీ సలీంబాషా



ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని కరువు మండలాల్లో కూలీల వలసలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాల్లో ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యోగులందరూ సమిష్టిగా కృషి చేస్తున్నారన్నారు. ఎపిడి స్థాయి నుంచి పిఒలు, కిందిస్థాయి సిబ్బంది వరకూ పూర్తిస్థాయిలో పని చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రోజువారి కూలీల సంఖ్య పెంపు, కనీస వేతనం, ఫారంపాండ్ల నిర్మాణాలు, 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య పెంపు, కరువు మండలాల్లో అదనపు 50 రోజుల పని దినాలు, వ్యక్తిగత సోక్‌పిట్లు, వ్యక్తిగత సోక్‌పిట్లు, తదితర నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూస్తామన్నారు. ఫారంపాండ్లు నిర్మించుకున్న రైతులకు 10 రకాల పండ్ల మొక్కలు, కాయగూరల కిట్లను అందజేయనున్నట్లు తెలిపారు. జనవరి నుండి జూన్ చివరి నాటికి ప్రతి గ్రామ పంచాయితీకి 25 చొప్పున ఫారంపాండ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు లక్ష్యం కేటాయించినట్లు తెలిపారు.

తాగునీటి బోర్లు ఏర్పాటు

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామ పంచాయతీ పరిధిలో 15 ఫైనాన్స్ నిధులతో గ్రామ పంచాయతీ వారు రూ.3లక్షలతో తాగునీటి బోర్లు వేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మల్లెల జగదీష్, మాజీ సర్పంచు చాకలి ఎర్రిస్వామి, స్టోర్ డీలర్ సాకే నరసింహులు, అంబేద్కర్ గురుకుల పాఠశాల వైస్‌ఛైర్మన్ మండల్ల చంద్రశేఖర్, బైనే యల్లప్ప, గజరాజుల ఆంజనేయులు, మధు, రాంబాబు, కొమ్మ కేశప్ప, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సత్కారం

అనంతపురం : నగరంలోని లలిత కళా పరిషత్‌లో ఐఎంఎం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా కరోనా సమయంలో సేవ లందించిన పలువురిని గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముస్లిములు ఎప్పుడు ఏ అవసరం అడిగతినా తనవంతు సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐఎంఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహబూబ్‌బాషా, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సలార్‌బాషా, ఉమర్, షేక్షావలి, సైఉద్దీన్, మురళి, డాక్టర్ గపూర్, జాకీర్‌హుస్సేన్, సుల్తాన్‌జాకీర్, మధు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ జూటూరు షరీఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధాశ్రీదేవి, ఎస్ఐ సాగర్, ఉపాధ్యాయులు ఆదినారాయణ, వెంకటనాయుడు, రామన్న, కొండారెడ్డి, రమణారెడ్డి, శశికళ, పవిత్ర, నాగరాజు, మహేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లాలోని కణేకల్ మండలం రామ్‌నగర్‌లో జంగం బసవరాజు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.శ్రీనివాసులు, బి.సురేష్‌కుమార్, బి.మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడిసివ్' వాడకంపై అవగాహన సదస్సు

హాజరైన రాఫ్ ఆడిసివ్ కంపెనీ జోనల్ మేనేజర్ రవి



మాట్లాడుతున్న షోరూం అధినేత దామోదర్, రాఫ్ ఆడిసివ్ కంపెనీ జోనల్ మేనేజర్ రవి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న శ్రీసాయి బాలాజీ అసోసియేట్స్ షోరూంలో ఆడిసివ్ సిమెంట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి బాలాజీ అసోసియేట్స్ అధినేత దామోదర్ టైల్స్ లేయింగ్ వర్క్‌పై వర్కర్లకు అవగాహన కల్పించారు. ఇంటి నిర్మాణంలో కీలకమైన ఆడిసివ్ సిమెంట్ వాడకంపై అవగాహన అవసరమన్నారు. లేయింగ్ వేసే తప్పుడు తప్పనిసరిగా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాఫ్ ఆడిసివ్ కంపెనీ జోనల్ మేనేజర్ రవి, బ్రాంచ్ మేనేజర్ అబ్దుల్లా, కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్, సాయి బాలాజీ అసోసియేట్స్ మేనేజింగ్ పార్ట్నర్ శ్రీదేవి, మోహన్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌కు అభినందనలు

అనంతపురం : జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులతోపాటు కో-ఆర్డినేటర్ శారదను గురువారం స్థానిక జెఎన్‌టియు విశ్వ విద్యాలయంలో ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మమత, రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.నాగశుభ పాల్గొన్నారు.

వ్యాపార అభివృద్ధిపై శిక్షణ

గుత్తి : మున్సిపాలిటీలో సర్వీస్ ప్రొవైడర్లగా దరఖాస్తు చేసుకున్న ఎలక్ట్రిషన్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మెప్మా విభాగం-స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వెంకటేశ్వర ఐటిఐ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా మాట్లాడుతూ ఎలక్ట్రిషన్లకు ఉన్న నైపుణ్యంతో సేవలందించి మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం శ్రీనివాస్‌రెడ్డి, సిఒలు చంద్రశేఖర్, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

యాడికి : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

పి-4 సర్వే పరిశీలన

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 36వ డివిజన్ 52వ సచివాలయ పరిధిలో సి16 క్లస్టర్‌లో గురువారం చేపట్టిన పి 4 సర్వేను కమిషనర్ బాలస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సర్వేకు సంబంధించి యాప్‌లో నమోదు చేయాల్సిన వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు పరిపాలన కార్యదర్శి, అమినిటీస్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ కృష్ణయ్య, ఐసిడిఎస్ సిడిపిఒ భారతి అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రి ప్రైమరీ స్కూల్లో బోధించడానికి జ్ఞానజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రవికుమార్, యల్లప్ప, హనుమంతు, సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, సిడిపిఒ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో అంగనవాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎఫ్ఎల్ఎన్ జ్ఞానజ్యోతి విద్యను పెంపొందించి.. విద్యలోని మెళకువలు, తదితర అంశాలను డిఆర్‌పిల ద్వారా ప్రొజెక్టర్ వేసి అంగన్వాడీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ షాజిదా బేగం, ఎంఇఒ శ్రీదేవి, ఓబుళపతి, అంగన్వాడీలు, సూపర్‌వైజర్లు రామలక్ష్మి, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

శింగనమల : మండల కేంద్రంలోని జెడిపిహెచ్ఎస్, రెజిబివి పాఠశాలల్లో తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ ప్రసాద్, జిల్లా ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ విజయలక్ష్మి, కెజిబివి ప్రిన్సిపాల్ గీతారాణి, సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణ, ఎఎన్ఎం శైలజ, హెల్త్ ప్రొవైడర్ దివ్య భారతి, పాఠశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'పివికెకె'లో లింగ సమానత్వంపై అవగాహన

అనంతపురం : స్థానిక రుద్రంపేట రోడ్డులోని పివికెకె ఇంజినీరింగ్ కాలేజ్ (అటానమస్)లో మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బండి రమేష్ బాబు ఆధ్వర్యంలో 'లింగ సమానత్వం – సున్నితత్వం'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది కె.పద్మనారాయణరెడ్డి లింగ సమానత్వం, సమాన హక్కులు.. అవకాశాల కోసం ఎలా వినియోగించుకోవాలి, సమానత్వం కోసం అవసరమైన చట్టాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్, మహిళా సాధికారిక విభాగం కన్వీనర్ ఎ.పావని, సహ కన్వీనర్ వై.మమత, మహిళా సాధికారిక విభాగ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా మేరకు.. గుత్తి ఆర్ఎస్ కు చెందిన విశ్రాంత పోస్ట్ మెన్ మస్తాన్‌వలి (66) పని నిమిత్తం కర్నూలు జిల్లా జి.ఎర్రగుడి తండాకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని గుత్తి వచ్చేందుకు ఆటో ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా గుత్తి నుంచి పత్తికొండ వైపునకు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు రోడ్డుపై ఎగిరి పడటంతో లారీ అతడిపై నుంచి వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు.గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో వైద్యులు చికిత్స ప్రారంభించేలోగా అతడు మరణించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య

డి.హీరేహాల్ : కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలోని సిద్దాపురంతండాలో చోటుచేసుకుంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దాపురంతండాకు చెందిన లోకేష్‌నాయక్ (34) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక తన ఇంటి పెరట్లో ఉన్న యాంగలర్‌కు ఉరి వేసుకున్నాడు. భార్య లక్ష్మీబాయి గమనించి అరవడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని ఉరికి వేలాడుతున్న లోకేష్‌నాయక్‌ను కిందకు దించి హుటాహుటిన బళ్లారిలోని విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్కా బీటర్లు అరెస్టు

రాయదుర్గం రూరల్ : బొమ్మనహాల్, డి.హీరేహాల్, గుమ్మఘట్ట, కణేకల్లు మండలాల్లో ఆన్‌లైన్‌లో మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 9 మంది బీటర్లను అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ వెంకటరమణ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం సిఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 9 మంది మట్కా బీటర్ల నుంచి రూ. 1,82,500 నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో మట్కా, పేకాట, బెట్టింగ్, తదితర జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిఐతో పాటు ఆయా మండలాల ఎస్ఐలు నబీరసూల్, గురుప్రసాద్‌రెడ్డి, నాగమధు, ఈశ్వరయ్య ఉన్నారు.